మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్షోత్సవాల్లో ఉత్తమ విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసిన కలెక్టర్

దత్తత పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా శిశు గృహ నుంచి దత్తత తీసుకున్న చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, అడాప్షన్ రెగ్యులేషన్స్ ప్రకారం జిల్లా కేంద్రంలోని శిశు గృహలోని చిన్నారిని హైదరాబాద్‌కు చెందిన దంపతులకు గురువారం తన చాంబర్‌లో కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న దంపతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పిల్లలకు ఉన్నత విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అలాగే, గత జనవరిలో చెన్నైకి చెందిన దంపతులకు పాపను దత్తత ఇవ్వగా, అందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీని వారికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఎం సరస్వతి, పీవో తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది రాజేశ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

ఐసీడీఎస్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

కలెక్టరేట్, మార్చి 28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్షోత్సవాల్లో ఉత్తమ విధులు నిర్వహించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అంద జేశారు. ఈనెల 9 నుంచి 23 వరకు పోషణ్ పక్వాడాలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల కోసం చేపట్టిన అవగాహన కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచాయి. జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవగా, ఆయా కార్యక్రమాల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగులను గుర్తించి, కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. జిల్లా కో ఆర్డినేటర్ ఈ నాగరాజు, ప్రాజెక్టు అసిస్టెంట్ జీ రొమీల, హుజూరాబాద్ సీడీపీవో తిరుపతమ్మ, సూపర్‌వైజర్ శిరీష, బ్లాక్ కో ఆర్డినేటర్ కే నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ కరుణ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరికి కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి అండ

సైదాపూర్, మార్చి 28: వెన్కేపల్లికి చెందిన మ్యాకల మహేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా, బాధిత కుటుంబానికి అతడి మిత్రులు (వెన్కేపల్లి పాఠశాల 2005–06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు) అండగా నిలిచారు. తలా కొంత విరాళాలతో రూ.65వేల పోగు చేశారు. ఈ మొత్తాన్ని మహేందర్ కుమార్తె పేరిట పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గురువారం బాండ్ పేపర్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిమ్మాపూర్, మార్చి 28: మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి మరణించాడు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో 15 రోజుల నుంచి గుర్తుతెలియని, మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి గ్రామంలో సంచరిస్తూ ఉన్నాడు. గ్రామ శివారులో పెట్రోల్ బంక్ ఖాళీగా ఉండగా అందులో పడుకునేవాడు. ఈ క్రమంలో గురువారం గ్రామస్తులకు మృతి చెంది కనిపించాడు. ఎండ తీవ్రతకు తట్టుకోలేకనే అతను మరణించినట్లు గ్రామ కార్యదర్శి అరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు చెప్పారు. మృతుడి వయసు 40– 50 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. అతడి ఆచూకీ గుర్తించే వరకు జిల్లా ప్రధాన ప్రభుత్వ దవాఖాన మార్చూరీలో మృతదేహాన్ని ఉంచినట్లు చెప్పారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు ముమ్మరం..

తిమ్మాపూర్, మార్చి28: మండలంలోని ఓ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థి కొద్ది రోజుల కింద అదృశ్యం కాగా, బుధవారం అతడి మృతదేహం తిమ్మాపూర్ శివారులోని ఓ రైతు బావిలో బయటపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యార్థి మృతిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విద్యార్థి స్నేహితులు, పలువురిని గురువారం సీఐ స్వామి, ఎస్ఐ చేరాలు ఆధ్వర్యంలో విచారించారు. అలాగే మృతదేహం కుళ్లిన స్థితిలో పలు అవయవాలు లేకపోవడంతో బావిలో ఉన్న నీటిని మరో మోటర్ ఉపయోగించి తోడిస్తున్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

తెలంగాణచౌక్,మార్చి28: పెంచిన టెట్ ఫీజును తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. గతంలో రెండు టెట్ పేపర్లకు రూ. 300 ఉన్న ఫీజును ఏకంగా రూ. 2 వేలకు పెంచడం దారుణమన్నారు. కాంగ్రెస్ మ్యాని ఫెస్టోలో ఫీజుల్లేకుండానే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని వాగ్దానం చేసిందని, ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా పెంచడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రమేశ్, రాజేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, మార్చి 28 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఉద్యోగులకిచ్చిన హామీ లను సత్వరమే అమలు చేయాలని, అఖిల బ్రాహ్మణ ఉద్యోగుల సమాఖ్య జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం కోతిరాంపూర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘం అధ్యక్షుడు బొప్పరాజు సంజీవరావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎలక్షన్ కమిషన్ అనుమతితో డీఏ విడుదల చేయాలని కోరారు. బ్రాహ్మణ ఫెడరేషన్‌కు నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు దీపుకుమార్, ఆంజనేయశర్మ, రఘురామయ్య, పవన్‌శర్మ, బొప్పరాజు విఠలరావు, రామకశంకరశర్మ, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

BEFORE THE STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION TELANGANA AT HYDERABAD
FA 146 OF 2023
IN
CC 75 OF 2014
(On the file of Dist Commission - Karimnagar)
Between:
United India Insurance Co ltd.,
Rep by its Manager, ...Appellant
And
G. Manohar ... Respondent No.1
Dr. Anand V.Kadarkoppa ... Respondent No.2
To
G. Manohar S/o. Venkat Reddy, Age: 41 Yrs Occ: Business Real Estate Agent, R/o Golalipalli Village of Thimanpur Mandal of Karimnagar Dist.
The above named Appellant Insurance Company filed an appeal before the State Commission of Telangana at Hyderabad challenging the order of the Dist Commission Karimnagar Passed in the above CC. The notice sent to you was returned with an endorsement Insufficient address". Hence the Hon'ble State Commission ordered substitute service of notice to you. Take Notice the above matter is posted to 8th April 2024 at 10.30 AM for your appearance. If you fail to appear on the said date the matter will be decided against you. Hence fail not.
Issued by the order of the State Commission
Counsed for Appellant
Sd/- Suri Sravan Kumar, M.com, LLB., DTL
ADVOCATE, 211, Gulrez Apts, Rajbhavan Road, Somajiguda,Hyd - 500 082
Mob: 92463 75635/73821 84312
Hyderabad, 27.03.2024

సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311301

CHANGE OF NAME
★Kokkula Manvith, H.No. 1-4-10, Venkampet Road, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed as Kokkula Vasista Bhargava.
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లక్ష్యానికి చేరువలో బల్దియా

దుకాణా సముదాయం నిర్వాహకుడి వద్ద పన్ను వసూలు చేస్తున్న అధికారులు

- హుజూరాబాద్‌లో ఇప్పటి వరకు 92.12శాతం పన్నులు వసూలు
- రాష్ట్రంలోనే 2వ స్థానంతో మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు

హుజూరాబాద్ టౌన్, మార్చి 28: ఆస్తి పన్ను వసూళ్లలో హుజూరాబాద్ బల్దియా లక్ష్యం దిశగా దూసుకెళ్తున్నది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ బుధవారం వరకు 92.12శాతం పన్నుల వసూళ్లతో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ గురువారం ప్రకటించింది. అధికారులు ఇంటి, నల్లా, తైబజార్ పన్నుల వసూలు కోసం పట్టణంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అలాగే పాత బకాయిలు చెల్లించడంలో మొండిగా వ్యవహరిస్తున్న గృహ యజమానులకు రెడ్ నోటీసులు అందిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు పట్టణంలో ఇంటింటా తిరుగుతూ పన్ను వసూళ్లను వేగవంతం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆస్తి, నల్లా, తైబజార్ పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ముందంజలో ఉన్న హుజూరాబాద్ మున్సిపాలిటీని మిగిలిన మూడు రోజుల్లో లక్ష్యం సాధించి రాష్ట్రం లోనే టాప్ 1 స్థానంలో నిలుపుతామన్న ధీమాతో ఉన్నారు.

లక్ష్యం రూ.2 కోట్ల 49 లక్షలు..

హుజూరాబాద్ పట్టణ జనాభా సుమారు 34 వేల 555 (2011 జనాభా లెక్కల ప్రకారం). పట్టణంలో 8769 వాణిజ్య సముదాయాలు, నివాస గృహాలు ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2 కోట్ల 49 లక్షల పన్నులు వసూలు చేయాలని పురపాలక అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 27 నాటికి రూ.2 కోట్ల 29 లక్షల పన్నులు వసూలు కాగా (92.12 శాతం), జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, ఓ నగరపాలక సంస్థల్లో హుజూరాబాద్ ప్రథమ స్థానంతో ముందంజలో నిలిచింది. మరో రూ.20లక్షలు వసూలు చేయాల్సి ఉంది. అలాగే నల్లాల (వాటర్ ట్యాక్స్) పన్నులు రూ.2కోట్ల 41లక్షల36వేలకు రూ.60.90లక్షలు (25.23 శాతం) వసూలు కాగా, తైబజార్ పన్నుల వసూళ్లలో రూ.14.52లక్షలకు గానూ రూ.14.52 లక్షలు(వంద శాతం) వసూలు చేశారు. దుకాణాల అద్దె రూ.49లక్షల 53వేలకు గానూ రూ. 9లక్షల 87వేలు (19.93 శాతం) వసూలయ్యాయి.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా పట్టణం, విలీన గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించి వసూలు చేస్తున్నాం. మొండి బకాయిల వసూళ్ల కోసం 20 మందికిపైగా ఇంటి యజమానులకు రెడ్ నోటీస్ అందించాం. గడువులోగా వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం.

- సల్వాది సమ్మయ్య, కమిషనర్, హుజూరాబాద్ మున్సిపాలిటీ

గండ్ర, అన్నవరానికి ప్రతిభా పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, మార్చి 28: తెలుగు యూనివర్సిటీ ఏటా ఇస్తున్న ప్రతిభా పురస్కారాలకు ఈ యేడు జిల్లాకు చెందిన అవధాన శేఖర డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రఖ్యాత చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగేడ కిషన్‌రావు, ముఖ్యఅతిథి ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు, కవి బీ నరసింగరావు చేతుల మీదుగా పురస్కార పత్రంతో పాటు రూ. 20 వేల పారితోషికం అందించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ, 73 ఏళ్ల వయస్సులో అవధాన ప్రక్రియకు గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన వ్యక్తి డాక్టర్ లక్ష్మణరావు అని కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును గాజుల రవీందర్, శ్రీనివాస్, కేఎస్ అనంతాచార్య, దాస్యం సేనాధిపతి అభినందించారు.

హన్మాజిపల్లి పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

గన్నేరువరం, మార్చి 28 : హన్మాజిపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో జనార్దన్ రావు గురువారం తనిఖీ చేశారు. వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. కాగా, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, విద్యార్థులకు సరిగా చదువు చెప్పడం లేదని డీఈవోకు ఫిర్యాదు చేశారు.

ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో వీడ్కోలు వేడుక

కమాన్‌చౌరస్తా, మార్చి 28 : కరీంనగర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ టీ లక్ష్మి హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సంపత్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు శంకుతల, శ్రీధర్‌రావు, శామ్యూల్, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలి

కొత్తపల్లి, మార్చి 28 : టీఎన్జీవోస్ సొసైటీ భవనానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని యూనియన్ నాయకులు గురువారం కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీకి పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయినా బల్దియా ఆఫీసు నుంచి ఏటా పన్ను చెల్లించాలని నోటీసులు వస్తున్నాయని చెప్పారు. రెవెన్యూ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ పన్నుల వసూలుపై బల్దియా కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ టీఎన్జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మేందర్‌సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేశ్ భరద్వాజ్, అర్బన్ కార్యదర్శి సుమంత్‌రావు, నాయకులు రాజేశ్వర రావు, పవన్ కుమార్, వంశీ, అజయ్, నారాయణ, శ్రీమాన్‌రెడ్డి, కరుణాకర్, షేక్ అంజాద్ ఉన్నారు.

కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీఎన్జీవో నాయకులు

ఒక్కరోజే రూ. 2.38 కోట్ల పన్ను వసూలు

ఆర్టీసీ నుంచి ఆస్తి పన్ను చెక్కును అందుకుంటున్న డిప్యూటీ కమిషనర్

కార్పొరేషన్, మార్చి 28: కరీంనగర్ బల్దియా యంత్రాంగం పన్ను వసూలులో జోరు పెంచింది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన మొండి బకాయిలను రాబడుతున్నది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ముందే గురువారం ఒక్క రోజే రూ.2.38 కోట్లు వసూలు చేసింది. సర్కారు అమలు చేస్తున్న వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంలో భాగంగా వడ్డీపై 90 శాతం మాఫీ ప్రకటించింది. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల ఆస్తి పన్ను వసూలుపై దృష్టి పెట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి రూ. 1.88,87,368ను గురువారం వసూలు చేశారు. ఆర్టీసీ అధికారులు చెక్కును బల్దియా డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి అందుకున్నారు. అలాగే వివిధ ఇంటి యాజమానుల నుంచి రూ.50 లక్షలకు పన్నులు వసూలయ్యాయి.

రైతులకు రూ.12.31 కోట్ల రుణాల మంజూరు

చిగురుమామిడి, మార్చి 28: మండలంలోని రైతులకు చిగురుమామిడి వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రూ.12.31 కోట్ల రుణాలను అందజేశామని సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి వెల్లడించారు. గురువారం మండల కేంద్రంలో సింగిల్ విండో వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, సంఘ సభ్యులకు క్రాప్ లోన్ ద్వారా రూ.8.67 కోట్లు, కర్షకమిత్ర లోన్ ద్వారా రూ.3.64 కోట్లు దీర్ఘకాలిక రుణాలను అందించినట్లు వివరించారు. యాసంగి, వాన కాలంలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.27 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల సౌకర్యం కోసం చిగురుమామిడి, రేకొండ, ఇందుర్తి గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం కార్యాలయ సీఈవో కాటం నర్సయ్య సంఘం ఆదాయ వ్యయాల వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కరివేద మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, అందె స్వామి, కూతురు రవీందర్ రెడ్డి, తాళ్లపల్లి తిరుపతి, పోతరవేణి శ్రీనివాస్, మాచమల్ల లచ్చవ్వ, పేరాల లక్ష్మి, కార్యాలయ ఉద్యోగులు కుమారస్వామి, శ్రీనివాస్, లింగయ్య, పవన్, రైతులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఇండస్ట్రీస్ ఆఫీసు ఎదుట నిరసన

కొత్తపల్లి, మార్చి 28: బావుపేటలో కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీ అసోసియేషన్ ఆఫీసు ఎదుట ఫ్యాక్టరీల యజమానులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రానైట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మూడు నెలలుగా సర్వసభ్య సమావేశం నిర్వహించడం లేదని ఆరోపించారు. పదేళ్లుగా అసోసియేషన్ ఖర్చు చేసిన లెక్కలు వెంటనే చెప్పాలని డిమాండ్ చేశారు. సభ్యుల ఆమోదం లేకుండా విదేశాలకు వెళ్లి అనవసర ఖర్చులు చేస్తున్నారని ఆరోపించారు. అసలు అసోసియేషన్ బిల్డింగ్, షట్టర్స్ ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ అయిందో, పర్మిషన్ ఎవరి పేరిట ఉందో స్పష్టత ఇవ్వాలన్నారు. అసోసియేషన్ పాలకవర్గం తీరుతోనే గ్రానైట్ ఫ్యాక్టరీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, కరెంట్ బిల్లులు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అసోసియేషన్ బాడీని రద్దు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇక్కడ ఫ్యాక్టరీల యజమానులు బీ సాగర్, ఆర్ విక్రం, కే సత్యనారాయణ, టీ శ్యాంరావు, కే సతీశ్‌రావు, అశోక్‌రెడ్డి, పవన్‌కుమార్, ఎస్ కరుణాకర్, జే మధు, పీ సత్యం, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

నిరసన తెలుపుతున్న ఫ్యాక్టరీల యజమానులు

తాళ్లతో బంధించి.. ఒంటిపై వేడి నీళ్లు పోసి..

- భర్తను హత్య చేసిన భార్య
- కన్నతల్లి ఎదుటే కిరాతకం

రాంనగర్, మార్చి 28: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గురువారం దారుణం చోటుచేసుకున్నది. భర్తను భార్య తాళ్లతో కట్టి కారంపొడి, వేడి నీళ్లను ఒంటిపై పోసి రోకలి బండతో బాది హతమార్చింది. కన్నతల్లి ఎదుటే ఈ కిరాతకానికి ఒడిగట్టింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన తోట హేమంత్‌కు రోహితితో 2012లో వివాహం జరిగింది. హేమంత్ (39) పెట్రోల్ బంక్‌లో పనిచేసి కొంతకాలం కిందట మానేశాడు. రోహితి ప్రభుత్వ దవాఖానలో కాంట్రాక్టుగా పేషెంట్ కేర్‌గా పనిచేస్తున్నది. కొంత కాలంగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రోహితి ఇద్దరితో కలిసి ఇంటికి వచ్చింది. గేట్, ఇంటి తలుపులు పెట్టి హేమంత్‌ను ఇంట్లో తాళ్లతో కట్టేసి కారం పొడి పోసి చితకబాదారు. కొంతసేపటి తర్వాత ఇద్దరు వెళ్లిపోగా భార్య రోహితి వేడి నీరు ఒంటిపై పోసి రోకలి బండతో తలపై బాదడంతో తీవ్ర రక్తస్రావం జరిగి, మర్మాంగంపై గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు.

హేమంత్ (ఫైల్)

చికిత్స కోసం అంబులెన్సులో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. కాగా, హేమంత్ తల్లి విమల కండ్ల ముందరే ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. కారంపొడి, వేడి నీళ్లు పోసి తన కొడుకును కొట్టి కళ్ల ముందు చంపేశారంటూ రోదించింది తల్లి. ముగ్గురు పిల్లలున్నారని వద్దని వేడుకున్నా వినలేదన్నారు. తల్లి విమల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పథకం ప్రకారమే హత్య..

ఇంట్లో హేమంత్ రోహితి మధ్య తరచూ గొడవలు జరుగుతాయి. మంగళవారం కూడా ఘర్షణ జరిగింది. ఈ విషయం రోహితి ఇద్దరు వ్యక్తులకు చెప్పింది. దీంతో వారు హేమంత్‌ను హతమార్చేందుకు పథకం పన్ని బుధవారం ఉదయం నుంచి మద్యం తాగుదాం బయటికి రా అంటూ పలుమార్లు ఫోన్ చేశారు. ఈ విషయం హేమంత్ బంధువులకు తెలపగా వారి సూచన మేరకు ఇంట్లోనే ఉన్నాడు. అతడు బయటకి రాకపోవడంతో రాత్రి ఇంటికి వచ్చి పథకం ప్రకారం హత్య చేసినట్లు బంధువులు చెబుతున్నారు. నిందితులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వీణవంక: మామిడాలపల్లిలో శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వర్షాలు కురువాలి.. ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

వీణవంక, మార్చి 28: రానున్న వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురువాలని.. ప్రజలు సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఆకాంక్షించారు. గురువారం మండలంలోని మామిడాలపల్లిలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఎంతో వ్యయంతో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం నిర్మించడం హర్షించదగిన విషయమన్నారు. రానున్న రోజుల్లో మామిడాలపల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు అందజేస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం వారు వల్భాపూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విలువైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే చల్లూరులో ఎంపీటీసీ ఎలవేన సవిత–మల్లయ్య కూతురు వివాహానికి, రెడ్డిపల్లి గ్రామంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల–సాధవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, ఎంపీటీసీలు మూల రజిత–పుల్లారెడ్డి, దేవేందర్, మాజీ సర్పంచులు బండ సుజాత–కిషన్‌రెడ్డి, పోతుల నర్సయ్య, రఘుపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కామిడి కావ్య–శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్, రాజమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం, మార్చి 28: మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బాలకిషన్ వేర్వేరుగా వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వారి వెంట జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ గుర్రాల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, నాయకుడు సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరు

రామడుగు(చొప్పదండి), మార్చి28: వెలిచాలలో గురువారం జరిగిన పలు వివాహ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నేత, సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు ఉన్నారు.

వెలిచాలలో వధూవరులను ఆశీర్వదిస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

కిట్స్‌లో స్టార్టప్స్‌పై శిక్షణ

హుజూరాబాద్ రూరల్, మార్చి 28: సింగాపూర్ కిట్స్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్, కిట్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిన్నతరహా పరిశ్రమల స్థాపనపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్స్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, ఏదైనా ఒక కొత్త ఆలోచన, ఆర్థిక వనరులు కలిగి ఉన్న విద్యార్థులు స్వయంగా ఒక చిన్న తరహా పరిశ్రమ స్థాపించేందుకు ముందుకు రావాలని, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ పీ ముత్తు కుమారన్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల సైన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వీ సతీశ్ కుమార్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ యోగేశ్ పుండలిక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ బలగాల కవాతు

మానకొండూర్/ హుజూరాబాద్ టౌన్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామంలో, హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట, సిర్సపల్లి గ్రామాల్లో గురువారం సీఐఎస్ఎఫ్ బలగాల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎస్ఐ సాంబయ్య గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎల్ఎంకు తీవ్ర గాయాలు

మానకొండూర్, మార్చి 28: 33 కేవీ లైన్ మరమ్మతు పనులు చేస్తుండగా జేఎల్ఎం తీవ్రంగా గాయపడిన ఘటన మానకొండూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బాలకృష్ణ మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం 33 కేవీ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలోని ఎస్సీ శ్మశాన వాటికలో జంపర్ సరిచేసే సమయంలో ఇండక్షన్ సరఫరా కావడంతో ఆయన విద్యుత్ స్తంభం పైనుంచి పడిపోయాడు. విద్యుత్ సిబ్బంది తక్షణమే సమాచారం తెలుసుకుని తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతు పనులు సంబంధిత ఏడీఈ, ఏఈ పర్యవేక్షణలోనే చేపట్టాలనే నిబంధన ఉందని, కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈప్రమాదం జరిగినట్లు పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ముకరంపుర, మార్చి 28: మానకొండూర్ సెక్షన్‌లో విద్యుదాఘాతంతో జేఎల్ఎం ప్రమాదానికి గురైన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియాన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు నలువాల స్వామి డిమాండ్ చేశారు. జంపర్ ఓపెన్ చేసేందుకు జేఎల్ఎంను ఒక్కరినే పంపించారని, ప్రమాదంలో స్తంభంపై నుంచి కింద పడినా అతడిని చూసే వారే లేరని పేర్కొన్నారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

కోర్టుచౌరస్తా, మార్చి 28: కరీంనగర్ బార్ అసోసియేషన్ 2024–25 ఎన్నికలు గురువారం నిర్వహించి ఎన్నికల అధికారి కాసుగంటి మాధవ్‌రావు సాయంత్రం ఫలితాలు ప్రకటించారు. అధ్యక్షుడిగా పీవీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తిరుకోవెల రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా బేతి మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గుగులోతు భీమ, లైబ్రరీ కార్యదర్శిగా కటకం రాజేందర్, మహిళా ప్రతినిధిగా డీ రేణుక ఎన్నికయ్యారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కందుల అరుణ్ కుమార్, సుంకేదేవ కిషన్, మాతంగి రవీందర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాస్తాం ఆంజనేయులు, కొండ్ర లక్ష్మణ్, బెజ్జంకి శ్రీకాంత్, కోశాధికారిగా రామగిరి శ్రీనివాస్ ఎలక్ట్ అయ్యారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా మడిపల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఎన్నికల్లో 1030 మంది ఓటు హక్కు కలిగి ఉండగా 876 మంది ఓటేశారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర సివిల్ సప్లై మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు.

అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్

ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి

ఉపాధ్యక్షుడు తిరుకోవెల రఘువీర్

హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోస్కుల శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, మార్చి 28: న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా గోస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రటరీగా అప్పని రాజు, కోశాధికారిగా ఎం దివ్య, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పులుగు లింగారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కే భగవాన్‌రెడ్డి, సీకే జేమ్స్, ఎన్ సత్యనారాయణ తెలిపారు. కాగా, సహాయ కార్యదర్శిగా పీ జ్యోత్స్నాదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కే సరిత, మహిళా సభ్యురాలిగా ముశం మౌనిక గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు